క్లుప్తంగా

శాకంబరి అలంకరణలో లక్ష్మీదేవి అమ్మవారు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

దేవరాపల్లి: దేవరాపల్లిలోని శ్రీదేవి భూదేవి సమేత కళ్యాణ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో లక్ష్మీదేవి అమ్మవారు బుధవారం శాకంబరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రతి ఏటా ఆషాడమాసంలో వచ్చే మాస శివరాత్రిని పురస్కరించుకొని అమావాస్య ముందు రోజు శాకంబరి అలంకరణలో లక్ష్మీదేవిగా దర్శనమిస్తారని స్థానిక ఆలయ అర్చకులు చంద్రమౌళి గిరి నాగేశ్వర రావు శర్మ తెలిపారు. ఈ నేపథ్యంలోనే లక్ష్మీదేవి అమ్మవారిని వివిధ రకాల కాయగూరలతో శాకంబరిగా భక్తులు అలంకరించారు. ఈ సందర్భంగా లక్ష్మీ అష్టోత్తర, సహస్ర నామాలతో అధిక సంఖ్యలో హాజరైన భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో పూజలు జరిపారు.

ఆర్టీఐ యాక్టుపై అవగాహన

చోడవరం: సమాచార హక్కు చట్టంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. చోడవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఎన్.ఎస్.ఎస్, డిపార్టుమెంట్ ఆఫ్ హ్యూమానిటీస్ విభాగాల ఆధ్వర్యంలో విద్యార్థుకు బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ శాఖల నుంచి ఏమైనా సమాచారం కావాలంటే ఆర్‌టీఐ యాక్టును ఏ విధంగా ఉపయోగించుకోవాలనే అంశంపై అవగాహన కల్పించారు. దీనిపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ సత్యవతి, పిఐఒ రాధాకృష్ణ పాల్గొన్నారు.

ఉగ్గినవలసలో సంచార వైద్యచికిత్సలు

కె.కోటపాడు: వర్షాకాలంలో ఇంటి పరిసరాల్లో మురుగునీటి నిల్వలు లేకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని లంకవానిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి శైలజ అన్నారు. పీహెచ్‌సీ పరిధిలో గల ఉగ్గినవలస గ్రామంలో బుధవారం సంచార చికిత్సలో భాగంగా రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. 133 మందిని తనిఖీ చేసి ఉచితంగా మందులు అందించారు. దోమకాటు ద్వారా డెంగ్యూ, మలేరియా వ్యాధులు ప్రబలుతాయన్నారు. ప్రతీ శుక్రవారం డ్రైడేగా పాటించాలన్నారు. పీహెచ్‌ఎన్ ప్రమీలా, ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

చక్కని ప్రణాళిక, కృత్యాలతో బోధించాలి

రావికమతం: విద్యా విషయక పర్యవేక్షణలో భాగంగా మండలంలో గల మట్టవానిపాలెం, చిలకవానిపాలెం,టి.అర్జాపురం గ్రామాల్లో గల ఎంపియుపి స్కూల్‌లను జిల్లా విద్యా శిక్షణా సంస్థ,భీమునిపట్నం డైట్ లెక్చరర్ సిహెచ్ స్వామి భుధవారం సందర్శించారు.దీనిలో భాగంగా 1 నుంచి 5వ తరగతి విద్యార్థుల అభ్యసన సామర్థ్యలను, రెడియస్ ప్రోగ్రాం , విద్యార్థుల వర్కు బుక్కులను పరిశఋలించారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ చక్కని ప్రణాళికలు, తగిన కృత్యాల ద్వారా బోధన జరపాలని ఉపాధ్యాయులుకు సూచించారు. టి.అర్జాపురం పాఠశాలలో ఉదయం, సాయంత్రం స్టడీ అవర్స్ నిర్వహించడం అభినందనీయమన్నారు.

ప్రీ ప్రైమరీలో గట్టి పునాదులు వేయాలి

మాడుగుల రూరల్: అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుతున్న చిన్నారులకు ప్రీ ప్రైమరీలో గట్టి పునాది వేయాలని ఐసీడీఎస్ సీడీపీవో ఎం.శశికళ అన్నారు. కె.జె.పురంలో 1వ అంగన్‌వాడీ కేంద్రాన్ని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రాల ద్వారా చిన్నారులకు, బాలింతలు, గర్భిణులకు అందిస్తున్న పౌష్టికాహారం, కేంద్రంలో రికార్డులను పరిశీలించారు. కేంద్రం ఆవరణలో కిచెన్ గార్డెన్‌ను కూడా పరిశీలించారు. చిన్నారులతో రైమ్స్ చెప్పించారు. అక్షరాల గురించి అడిగారు. అంగన్‌వాడీ కార్యకర్త చంద్ర, ఆయా నూకరత్నం పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్యంపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ రాజారామ్

మాడుగుల: ప్రస్తుతం గ్రామాల్లో ప్రబలుతున్న సీజనల్ వ్యాధులపై అధికారులు దృష్టి సారించాలని ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్ అన్నారు. బుధవారం ఎంపీడీవో సమావేశ మందిరంలో కొత్తగా వచ్చిన సచివాలయ సిబ్బందితో పాటు మండల స్థాయి అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లా డారు. కొత్తగా వచ్చిన అధికారులు గ్రామాల్లో సీజనల్ వ్యాధులను గుర్తించి తమకు సమాచారం అందజేయాలని, మంచి నీటి పథకాలు క్లోరినేషన్ చేయాలని కోరారు. ఎంపీడీవో కొంకి అప్పారావు మాట్లాడుతూ ఒకటో తేదీ కల్లా కొత్తగా వచ్చిన అధికారులు తాము అందజేసే పింఛను దారులను ముందుగానే గుర్తించుకోవా లన్నారు. సచివాలయ పరిధిలో సమస్యలు తెలుసుకుని తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

రైతులకు కలవరం... వ్యాపారులకు వరం

- గిట్టుబాటు కాని బీరకాయల ధరలు
- పెట్టుబడులు కూడా రావడం లేదని రైతుల ఆవేదన
- తక్కువ ధరలకు కొనుగోలు చేస్తున్న వ్యాపారులు
- మండలంలో రోజూ 5 నుంచి 8 టన్నుల వరకు ఎగుమతి



సాలికమల్లవరంలో సాగు చేస్తున్న బీర పంట



ఇతర జిల్లాకు ఎగుమతి అవుతున్న బీరకాయలు

గొలుగొండ: బీర సాగు చేస్తున్న రైతులకు నష్టాలే మిగులుతున్నాయి. ఈ ఏడాది దిగుబడులు పెరిగి ధరలు పతనం కావడంతో తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ సాగుపై ఆధారపడి ఉన్న రైతులకు ధరలు లేక కాయలు ఎలా అమ్ముకోవాలో అని కన్నీరుమున్నీరు అవుతున్నారు. ప్రస్తుతం మండలంలో కిలో 8 రూపాయలకు వ్యాపారులు రైతుల వద్ద కొనుగోలు చేస్తున్నారు. మార్కెట్లో అధిక ధరలకు అమ్ముకుని లాభపడుతున్నారు.

700 ఎకరాల్లో సాగు విస్తీర్ణం

మండలంలో బీరసాగు సుమారుగా 700 ఎకరాల వరకు సాగు జరుగుతుంది. ఆగాకర సాగు తరువాత ఎక్కువగా సాగు జరిగేది బీర సాగే. ఈ ఏడాది మండలంలో ఎర్రవరం, పప్పుశెట్టిపాలెం, కంతారం, సాలికమల్లవరం, జమ్మేదేవిపేట, గొలుగొండ, పాగచెట్లపాలెం తదితర గ్రామాల్లో 700 ఎకరాల వరకు సాగు జరుగుతుంది. ఏప్రిల్ చివరి వారంలో ఈ సాగు ప్రారంభం కావడం ఆగస్టుకు చాలా వరకు ముగింపు కావడం జరుగుతుంది. అయితే మొదట్లో కిలో 50 రూపాయలకు అమ్మకాలు జరగగా ప్రస్తుతం వీటి ధర పతనం కావడం జరిగింది. సాధారణంగా బీరకాయలు ధరలు అంతగా తగ్గదల ఉండదు. ఎంత ఎక్కువగా పండినా ఇప్పటి వరకు కిలో 15 రూపాయల వరకు అమ్మకాలు జరిగేవి. కానీ ఈ ఏడాది ఒక్కసారిగా వీటి ధరలు పతనం కావడం జరిగింది. అన్ని ప్రాంతాల్లో ఒకేసారి సాగు రావడం, ఇతర మండలాల్లో సైతం సాగు ఎక్కువగా రావడంతో ధరలు తక్కువగా ఉన్నాయని అంటున్నారు. ఎకరం సాగుకు సుమారుగా రూ.40వేల వరకు పెట్టుబడి అయ్యిందని, పడిపోయిన ధరలతో వీటి పెట్టుబడి కూడా రాదని రైతులు ఆవేదన చెందుతున్నారు. ధరలు లేకపోవడంతో వ్యాపారులు అడిగిన ధరలకు విక్రయించాల్సి వస్తోందని రైతులు చెబుతున్నారు.

పందిరి సాగుతో అధిక దిగుబడులు

మండంలో బీర సాగు చేస్తున్న రైతులు పందిరి సాగుతోనే పంటలు పండించడం జరుగుతుంది. దీనివల్ల కాయల దిగుబడులు పెరగడంతో పాటు నాణ్యత బాగుంటుంది. కొంతమంది రైతులు కర్రలు, తాళ్ల సహాయంతో సాగు చేయగా మరికొంతమంది రైతులు సిమెంట్ పోల్స్‌తో శాశ్వతంగా పందిరి వేసి సాగు చేయడం జరుగుతుంది. దీని వల్ల బీర, ఆగాకర, దొండసాగుకు ఎంతో ఉపయోగ పడుతుంది.



కాయలు నాణ్యతగా ఉన్నా ధరలు పతనం

పెరిగిన ఎగుమతులు

గతంలో బీరకాయలు తక్కువగానే ఇతర ప్రాంతాలకు ఎగుమతి జరిగేది. కొత్త ఎల్లవరం ప్రాంతం నుంచి వ్యాన్లతో ఇతర ప్రాంతాలకు వ్యాపారులు బీరకాయలు కొనుగోలు చేసి రవాణా చేసేవారు. ఇప్పుడు సాలిక మల్లవరం, ఆరిల్లోవ, విప్పలపాలెం ప్రాంతాల నుంచి ప్రతి రోజూ వ్యాపారులు బీరకాయలు ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. దీని వల్ల సరఫరా పెరిగి ధరలు తగ్గాయని చెబుతున్నారు. కాకినాడ, తుని, రాజమండ్రి, అనకాపల్లి, విశాఖతో పాటు ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నట్టు వ్యాపారులు తెలుపుతున్నారు.

రేపు విద్యుత్ సరఫరా నిలుపుదల

నర్సీపట్నం: పెదబొడ్డేపల్లి సబ్‌స్టేషన్ మరమ్మతుల నిమిత్తం ఈ నెల 25న విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎ.వి.ఎస్.ఎం. అప్పారావు తెలిపారు. శారదనగర్, బ్యాంక్ కాలనీ, నర్సీపట్నం మెయిన్ రోడ్డు, సుబ్బారాయుడుపాలెం, కుసర్లపూడి, జానకీరామపురం, ధర్మసాగరం, జోగినాథునిపాలెం, చెట్టుపల్లి, గురందరపాలెం, నిండుగొండ, వేలంకాయలపాలెం ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కోరారు.

నాతవరం: మండలంలో గల 33 కె.వి.విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో గ్రామాల్లో విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం ఈనెల 25వ తేదీన సరఫరా నిలుపుదల చేస్తామని నర్సీపట్నం విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు అప్పారావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. చినగొలుగొండపేట సబ్ స్టేషన్ పరిధిలో గల గునుపూడి పి.కె.గూడెం, పెదగొలుగొండపేట, వెదురుపల్లి, మన్యపురట్ల ,లింగంపేట, పి.జగ్గంపేట, కొడవటిపూడి అగ్రహారం, కె.ధర్మవరం, ఆర్.పి.అగ్రహారం చిక్కుడుపాలెం, ఎస్.బి.పట్నం, సరుగుడు సుందరకోట పంచాయతీలు పరిధిలో గల 16 శివారు గ్రామలకు శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని వినియోగదారుల గ్రహించాలన్నారు.

దేవరాపల్లి: మండల పరిధిలోని 8 గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు స్థానిక విద్యుత్ ఏఈఈ కె. శంకరరావు తెలిపారు. వాకపల్లి ఫీడర్‌లో లైన్ మెయింట్‌నెన్స్ పనులు నిమిత్తం శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వాకపల్లి, తిమిరాం, మారేపల్లి, మామిడిపల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఎం. అలమండ ఫీడర్‌లో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ములకలాపల్లి, కొత్తపెంట, ఎన్‌జి.నగరం, కొత్తపెంట విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు. బోయిలకింతాడ విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి కె.కోటపాడు లైన్‌లో మేడిచెర్ల ఏబీ స్విచ్ వరకు 33 కేవీ లైన్ మెయింట్‌నెన్స్ పనులను ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 వరకు చేపడుతున్నట్టు ఏఈఈ తెలిపారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు



బూరుగుపాలెంలో పారిశుధ్య పనులు



మర్రిపాలెంలో డ్రైనేజీలు శుభ్రం చేస్తున్న సిబ్బంది

నర్సీపట్నం: మాకవరపాలెం మండలం బూరుగుపాలెంలో పారిశుధ్య పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. గ్రామంలోని పాఠశాల, సచివాలయ, వీధుల్లో పేరుకుపోయిన చెత్తను సర్పంచ్ ఒబ్బులరెడ్డి రమణ, కార్యదర్శి పర్యవేక్షణలో సిబ్బంది తొలగించారు. గ్రామం పరిశుభ్రంగా ఉండేందుకు ప్రజలు సహకరించాలని సర్పంచ్ కోరారు. అనంతరం సచివాలయంలో బదిలీపై వెళ్లిన సిబ్బందిని సత్కరించారు.

నాతవరం: ప్రతి గ్రామంలో పంచాయతీ కార్యదర్శులు పారిశుధ్య కార్మికులతో డ్రైనేజీలు శుభ్రం చేసి వీధుల్లో బ్లీచింగ్ పౌడరు చల్లించారు. తాగునీటి పథకాలు, కుళాయిలు, బోర్లలో క్లోరినేషన్ జరిపారు. ఇంటి పరిసరాలను శుభ్రం ఉంచుకోవడంతో పాటు దోమల లేకుండా జాగ్రత్తలు పాటించాలని దండోరా వేయించారు. పరిసరాల పరిశుభ్రతపై ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పిస్తున్నామని మర్రిపాలెం, నాతవరం పంచాయతీ కార్యదర్శులు చిన్న, లాలం శేషుకుమార్ అన్నారు.

చీడికాడ: అప్పలరాజుపురం గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టారు. రెండు రోజులుగా ప్రత్యేక పారిశుధ్య పనులను పంచాయతీ కార్యదర్శి పర్యవేక్షణలో నిర్వహిస్తున్నారు. కాలువల్లో సిల్ట్‌ను తొలగించారు. సర్పంచ్ చుక్కా అప్పలనాయుడు ప్రత్యేక శ్రద్ధతో ఈ పనులు నిర్వహిస్తున్నారు.

నీటి ఆధారం ఉన్న భూముల్లో వరినాట్లు



వ్యవసాయాధికారి ఎం.అనసూయ

మాడుగుల రూరల్: ప్రస్తుతం ఆడపాదడపా కురుస్తున్న వర్షాలు, నీటి ఆధారం వున్న భూముల్లో ఖరీఫ్ వరినాట్లు ప్రారంభమయ్యాయని మండల వ్యవసాయాధికారి ఎం. అనసూయ పేర్కొన్నారు. మాడుగుల మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఆమె బుధవారం 'సాక్షి' తో మాట్లాడారు. ఖరీఫ్ వరి సాధారణ విస్తీరణం 4,287 హెక్టార్లు కాగా, ప్రస్తుతం పెద్దేరు, తారకరామ, జలాశయం దిగువ ఆయకట్టు భూముల్లో వరినాట్లు ప్రారంభం అయ్యాయని, మోటారు పంపుసెట్లు ద్వారా కూడా వరినాట్లు వేస్తున్నారని తెలిపారు. కాగా ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా మండలంలో ఎం.కోడూరు సచివాలయంలో వీఏఏ పోస్టు ఖాళీగా ఉందని, ఇంకా ఎవరూ జాయిన్ కాలేదని తెలిపారు. మండలంలో వరి, చెరకు అపరాలు, సాగు సాధారణ విస్తీర్ణం 7,436 హెక్టార్లు కాగా, ఈ విస్తీర్ణం ఇంకా పెరగవచ్చునని ఏవో తెలిపారు.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై డ్రోన్ నిఘా



డ్రోన్ కెమెరాను ఎగురవేస్తున్న సిబ్బంది

నర్సీపట్నం: చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధానికి డ్రోన్ నిఘాను సమర్థంగా అమలు చేస్తున్నామని నర్సీపట్నం రూరల్ సీఐ ఎల్.రేవతమ్మ తెలిపారు. నర్సీపట్నం రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలోని నీలంపేట, సాదుపాకలు, గొలుగొండ స్టేషన్ పరిధి పాకలపాడు ప్రాంతాల్లో సీఐ పర్యవేక్షణలో సిబ్బంది బుధవారం డ్రోన్ కెమెరాతో నిఘా చర్యలు చేపట్టారు. బహిరంగ ప్రదేశంలో ఆరుగురు వ్యక్తులు మద్యం సేవిస్తూ డ్రోన్ కెమెరాకు చిక్కారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎస్పీ తుహిన్‌సిన్హా, డీఎస్పీ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు గంజాయి వంటి చట్ట వ్యతిరేక కార్యకపాల నిరోధానికి నిరంతరం డ్రోన్ కెమెరాతో నిఘా పెట్టామన్నారు. బహిరంగ మద్య పానం చేసినా చట్ట పరంగా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ రాజారావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇన్‌లైన్ క్లోరినేషన్ సిస్టమ్‌తో స్వచ్ఛమైన తాగునీరు




ఇన్‌లైన్ క్లోరినేషన్ సిస్టమ్ ఏర్పాటును పరిశీలిస్తున్న సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ

దేవరాపల్లి: ఇన్‌లైన్ క్లోరినేషన్ సిస్టమ్ ఏర్పాటు చేయడం ద్వారా ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు సరఫరా అందుతుందని ఎ.కొత్తపల్లి సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ అన్నారు. మండలంలోని ఎ.కొత్తపల్లి పంచాయతీ పరిధిలోని పందూరిపాలెం, సంజీవపురం గ్రామాల్లో గల మూడు మంచినీటి ట్యాంక్‌లకు ఇన్‌లైన్ క్లోరినేషన్ సిస్టమ్‌ను బుధవారం ఏర్పాటు చేశారు. పంచాయతీ పరిధిలోని ప్రజలందరికీ ఆరోగ్యకరమైన మంచినీటిని అందించడమే లక్ష్యంగా ఈ సిస్టమ్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఇన్ క్లోరినేషన్ సిస్టమ్‌ను ఏర్పాటు చేయడంతో ఇకపై పంపు ఆపరేటర్లు ట్యాంక్‌ల్లోకి దిగి క్లోరినేషన్ సమస్యకు శాశ్వత పరిష్కార లభిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఉదయ్‌భాస్కర్, ఇంజినీరింగ్ సిబ్బంది, క్లాప్‌మిత్రలు పాల్గొన్నారు.

గ్రామ శ్రేయస్సు ప్రణాళికను పక్కాగా సిద్ధం చేయాలి

దేవరాపల్లి: గ్రామ శ్రేయస్సు స్థితి స్థాపక ప్రణాళికను గ్రామ స్థాయి అన్ని శాఖల అధికారులు సమన్వయంగా పక్కాగా సిద్ధం చేయాలని ఎంపీడీవో సువర్ణరాజు సూచించారు. వెలుగు కార్యాలయంలో ఏపీఎం ఎస్. ప్రభాకర్ ఆధ్వర్యంలో గ్రామైక్య సంఘాల అధ్యక్షులు, వీవోఏలతో బుధవారం ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రణాళికలో భాగంగా ప్రతి కుటుంబ ఆర్థిక, సామాజిక అవసరాలు, జీవనోపాధుల ప్రణాళిక, ప్రభుత్వ సేవలు, వనరుల అభివృద్ధి తదితర వివరాలు సేకరించాల్సి ఉంటుందన్నారు. వెలుగు, వ్యవసాయ, పశుసంవర్ధక, ఉద్యాన, మత్స్యశాఖ తదితర శాఖల అధికారులతో కలిసి గ్రామైక్య సంఘాలు, వీవోఏల సమన్వయంతో ఆగస్టు నెలాఖరులోగా పూర్తి చేయాలన్నారు. అక్టోబర్ 2న జరిగే గ్రామ సభల్లో నివేదిక రూపంలో ప్రజలకు తెలియజేస్తామన్నారు. పశువైద్యాధికారి గాయత్రీదేవి, యూకో బ్యాంక్ మేనేజర్ హరికృష్ణ, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు లావణ్య, వెలుగు సీసీలు పాల్గొన్నారు.

ఊపందుకున్న వ్యవసాయ పనులు



పోతనవలసలో వరినాట్లు, దమ్ములు పనుల్లో రైతులు

కె.కోటపాడు: నాలుగు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో పల్లపు ప్రాంత గ్రామాల్లో ఖరీఫ్ వ్యవసాయ పనుల్లో భాగంగా వరినాట్లు వేసే పనులు సాగుతున్నాయి. ప్రధానంగా మల్లంపాలెం , పాచిలవానిపాలెం, పైడంపేట, రొంగలినాయుడుపాలెం, పోతనవలస తదితర గ్రామాల్లో పొలాలను దమ్ములు పట్టడంతో పాటు వరినాట్లు వేసే పనుల్లో రైతులంతా నిమగ్నమై ఉన్నారు. వర్షాలతో పాటు పొలాలకు సమీపంలో గల వ్యవసాయ బోర్లు, బావుల నుంచి నీటిని మడుల్లోనికి చేర్చి దమ్ములను పూర్తి చేసి నాట్లు వేస్తున్నారు.

అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించం

టీడీపీ నాయకులపై మండిపడ్డ వైఎస్సార్‌సీపీ నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సర్వేశ్వరరావు, పార్టీ అధ్యక్షులు రమణ తదితరులు

నర్సీపట్నం: మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించబోమని మాకవరపాలెం మండలం ఎంపీపీ రుత్తల సర్వేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు చిటికెల రమణ, పార్టీ సీనియర్ నాయకులు రుత్తల వాసు,పెట్ల భద్రాచలం, యూత్ ప్రెసిడెంట్ రుత్తల రాజు మండల టీడీపీ నాయకుడు అల్లునాయుడుపై ధ్వజమెత్తారు. బాబు ష్యూరిటీ..మోసం గ్యారంటీ కార్యక్రమానికి ప్రజల నుంచి వస్తున్న స్పందన చూసి ఓర్వలేక గ్రామస్థాయి నాయకుడు తన స్థాయికి మించి విమర్శలు చేయడం తగదన్నారు. 'కోఆపరేటివ్ సొసైటీని దోచుకున్న నువ్వా మా నాయకుడుని విమర్శించేది.. స్పీకర్ అయ్యన్నపాత్రుడుని బూచిగా చూపి భూకబ్జాలు, దోపిడీలు చేసిన చరిత్ర నీ కాదా?' అని అల్లునాయుడుని ఉద్దేశించి ప్రశ్నించారు. మాజీ ఎమ్మెల్యే గణేష్ రాజకీయ ప్రస్థానం అంతా నర్సీపట్నం నియోజకవర్గంలోనే జరిగిందన్నారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు పక్క జిల్లా నుంచి వలస వచ్చారన్న విషయం మరిచిపోవద్దన్నారు. ఈ ప్రాంత ప్రజలకు మేలు చేయాలని మాజీ ఎమ్మెల్యే గణేష్ మెడికల్ కాలేజీ తీసుకువచ్చారని, కనీస అవగాహన లేకుండా కాలేజీకి జీవో లేదని టీడీపీ నాయకుడు మాట్లాడడం హాస్యస్పదంగా ఉందన్నారు. సుమారు రూ.20 లక్షల వ్యయంతో కాలేజీకి భూసేకరణ చేశారని, నాగార్జున కన్‌స్ట్రక్షన్ వారు ఆ స్థలంలోనే నిర్మించిన ఐదు అంతస్తుల భవనం నీ కళ్లకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. యరకన్నపాలెం నుంచి యలమంచిలికి వేస్తున్న రోడ్డు పక్కాగా ఫారెస్టులో దేనని స్వయంగా అటవీ అధికారులే చెబుతున్నారని, రోడ్డు వేసిన స్థలంలో 1995లో మీ నాయకుడు అయ్యన్నపాత్రుడు ఆవిష్కరించిన వన సంరక్షణ సమితి బోర్డే అది అటవీ భూమి అనడానికి నిదర్శనమన్నారు.

నారు చివర్లు తుంచి నాట్లు వేయాలి



చౌడువాడలో నాట్లు వేయడాన్ని వివరిస్తున్న శాస్త్రవేత్త ఆదిలక్ష్మి, సోమశేఖర్.

కె.కోటపాడు: రైతులు వరినాట్లును వేసే సమయాల్లో నారు చివర్లను తుంచి నాట్లు వేయాలని రైతులకు అనకాపల్లి వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ ఆదిలక్ష్మి తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో బాగంగా బుధవారం చౌడువాడలో గల రైతులకు నాట్లు వేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. నారు చివర్లు తుంచి నాట్లు వేయడం వలన కాండపు తొలిచే పురుగు రాకుండా అరికట్టవచ్చునని వివరించారు. దమ్ము సమయంలో ఎకరాకు 50 కిలోల డీఏపీ, 10 కిలోల యూరియా వేసుకోవాలని సూచించారు. పొలం గట్లపై కలుపు లేకుండా చూసుకోవాలని, యూరియా వినియోగం తగ్గించడం ద్వారా పంట తెగుళ్ల బారిన పడకుండా చర్యలను తీసుకోవచ్చునని డాక్టర్ డి.ఉమామహేశ్వరరావు అన్నారు. కౌలు రైతులకు కార్డుల కోసం గ్రామాల్లో గల వీఆర్వోలను సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సోమశేఖర్, ప్రిన్సిపల్ సైంటిస్ట్ ఎక్స్‌టెన్షన్ డాక్టర్ వి.చంద్రశేఖర్, తనకల అప్పలనాయుడు, బంటు శ్రీను, వీఏఏ రామునాయుడు పాల్గొన్నారు.

క్వారీని రద్దు చేయాలంటూ నిరాహారదీక్ష



ఆర్డీవో కార్యాలయం వద్ద నిరాహారదీక్ష చేస్తున్న సాగుదారులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు

నర్సీపట్నం: మాకవరపాలెం మండలం, జి.కోడురు నల్లరాయి క్వారీని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సాగుదారులైన దళితులు, ప్రజా సంఘాలు బుధవారం ఆర్డీవో కార్యాలయం వద్ద నిరాహార దీక్ష చేపట్టాయి. ఈ ధర్నాకు బీఎస్పీ రాష్ట్ర కమిటీ సభ్యుడు బొట్టా నాగరాజు, జిల్లా ఓబీసీ చైర్మన్ బొంతు రమణ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు మట్ల చంటి, సీపీఎం నాయకులు చిరంజీవి, ప్రజా సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్వారీకి అనుమతులు ఇవ్వడం వల్ల దళిత సామాజిక వర్గాలకు చెందిన రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారన్నారు. క్వారీ వల్ల గాలి, నీటి కాలుష్యం పెరిగి ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. క్వారీ పేలుళ్లతో ఇళ్లకు పగుళ్లు ఏర్పడతాయన్నారు. స్థానికుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. క్వారీని వెంటనే రద్దు చేయాలన్నారు. దాని వల్ల కలిగిన నష్టానికి పరిహారం ఇవ్వాలన్నారు. భవిష్యత్తులో క్వారీలకు అనుమతులు ఇచ్చే ముందు స్థానికుల అభిప్రాయం తీసుకోవాలన్నారు. క్వారీ అనుమతులు రద్దు చేసే వరకు ఆందోళన కొనసాగిస్తామన్నారు. ఈ నిరాహారదీక్షలో అప్పారావు, గణేష్, లక్ష్మి, లవరాజు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలు, సిబ్బంది వేతనాలు చెల్లించండి



బుచ్చెయ్యపేటలో ఎంపీడీవో భానోజీరావుకు వినతి పత్రం అందిస్తున్న కూలీలు

బుచ్చెయ్యపేట: జాతీయ ఉపాధి హామీ పథకం కూలీలు, సిబ్బందికి వెంటనే బకాయిలు చెల్లించాలని కూలీలు నిరసనకు దిగారు. బుధవారం మండల కేంద్రం బుచ్చెయ్యపేటలో కూలీలు బకాయిలు చెల్లించాలని రైతు కూలీ సంఘం నేతలతో నిరసనకు దిగారు. సుమారు 11 వారాలుగా కూలీలు డబ్బులు ఇవ్వలేదని, వారానికి ఒకసారి అందించే కూలీ డబ్బులు మూడు నెలలు అవుతున్న ఇవ్వకపోతే ఎలా బతకాలని రైతు సంఘ నాయకులు కె మోహన్‌రావు, వద్దాది నాయుడు, పల్లా పోలినాయుడు డిమాండ్ చేశారు. కూలీ డబ్బులు అందించండి మా ఆకలి తీర్చండంటూ నినాదాలు చేశారు. ఏడాదికి ప్రతి కూలీకి 200 రోజుల కూలి పనులు కల్పించి రోజుకు రూ. 600 వేతనం అందించాలని కోరారు. ఎంపీడీవో భానోజీరావుకు వినతి పత్రం అందించారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



గరిశింగిలో ప్రజలకు సూచనలిస్తున్న ఎంపీడీవో సువర్ణరాజు తదితరులు

దేవరాపల్లి: ఇటీవల కురుస్తున్న వర్షాలతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని స్థానిక ఎంపీడీవో ఎం.వి. సువర్ణరాజు సూచించారు. మండలంలోని గరిశింగి గ్రామంలో సర్పంచ్ గూడెపు రాముతో పాటు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ కె.చంద్రశేఖర్, సీహెచ్‌వో ఎం.ఆనంద్, స్వచ్ఛ భారత్ మండల కోఆర్డినేటర్ వి.పి.వి. త్రినాథ్ తదితర అధికారుల బృందం బుధవారం పర్యటించారు. వీధుల్లో పర్యటించి డ్రైనేజీల్లో ఎప్పటికప్పుడు పూడికతీత చేపట్టాలని, నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పంచాయతీ అధికారులకు సూచించారు. దోమల నివారణకు దోమల మందు ఫాగింగ్ చేపట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా దేవరాపల్లి పీహెచ్‌సీ వైద్య సిబ్బంది గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు.

నారుమడిలో జాగ్రత్తలు తప్పనిసరి



దొండపూడిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న మండల వ్యవసాయశాఖ అధికారి రమేష్‌బాబు

రావికమతం: ఆరోగ్యకరమైన నారుమడికి తగు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి రమేష్‌బాబు సూచించారు. పొలం పిలుస్తోందిలో భాగంగా మండలంలో దొండపూడి గ్రామంలో బుధవారం క్షేత్రస్థాయి పర్యటన చేశారు. వ్యవసాయ సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కలిసి వరి నారుమడులను పరిశీలించారు. వరి నారుమడి సంరక్షణ, నాట్లు సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఏవో వివరించారు. రైతు సేవా కేంద్రాల్లో రైతులతో సమావేశమై ఖరీఫ్ సాగులో పాటించాల్సిన మెలకువలు, తగిన మోతాదులో యూరియా వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో దొండపూడి వ్యవసాయ సహాయకురాలు భాగ్యలక్ష్మి, ప్రకృతి వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పశువుల్లో ముద్దచర్మ వ్యాధికి టీకాలు



పశువులకు టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించిన సర్పంచ్ కొప్పుల వరలక్ష్మి, ఎంపీటీసీ రామకృష్ణ

రోలుగుంట: పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో స్థానిక పశువైద్య కేంద్రం వద్ద బుధవారం ముద్దచర్మవ్యాధి టీకాల శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి రైతులు తీసుకొచ్చిన 182 పశువులకు పశువైద్యాధికారి నూకేశ్వరరావు, గోపాల మిత్రలు ఐ.వి. రాజు, అన్నపూర్ణ, శివచ రాజేశ్వరి , కృష్ణజనార్దన్ తదితర సిబ్బందిని ఆరు టీంలుగా ఏర్పాటు చేసి ఈ టీకాలు వేయడం జరిగింది. ఈ సందర్భంగా ఈ వ్యాధి తీవ్రత, లక్షణాలు గురించి శిబిరానికి వచ్చిన రైతులకు వివరించారు. ఈ వ్యాధి సోకిన పశువుల్లో పాల దిగుబడి తగ్గిపోవడమే కాకుండా పునరుత్పత్తిశక్తి తగ్గిపోతుందన్నారు. ఇది ప్రాణాంతకమైన వాధి అని తెలిపారు. సర్పంచ్ కొప్పుల వరలక్ష్మి, ఎంపీటీసీ రామకృష్ణ మాట్లాడుతూ రైతులకు మేలు చేసే ఇటువంటి కార్యక్రమలపై విస్తృత ప్రచారం అవసరం ఎంతైనా ఉందన్నారు. పాలకేంద్రం అధ్యక్షుడు రుత్తల శ్రీను, రైతు సంఘం నాయకుడు కొట్టే చంద్రరావు పాల్గొన్నారు.